

# వాస్తు దెబ్బ తగిలింది

ఎమ్మోగి

సూర్యం ప్రహరీ గోడ కట్టించదల్చుకున్నాడు. ఇన్నాళ్లు అదొక దండగ ఖర్చు అని వాయిదా వేసుకుంటూ వచ్చాడు– కాని ఈ రోజు కట్టి తీరాలని నిర్ణయించుకున్నాడు. కారణం ఓ వాస్తు పండితుడు కనపడి ఇంటికి కాంపౌండ్ లేకపోతే వాస్తు పనిచెయ్యదని చెప్పాడు. నాలుగు గోడలు కట్టినప్పుడే వాస్తు పురుషుడికి బలం కలిగి పని చేస్తాడు అని చెప్పాడు. కాంపౌండు వాలు లేకపోతే పక్క ఇళ్ల వాస్తు దోషాలు కూడా మన ఇంటి మీద ప్రభావం చూపిస్తాయట.

అందుకని అర్జెంటుగా ఓ గౌండాను పట్టుకున్నాడు. ఇంటికి నాలుగువైపులా కాంపౌండు వాలు లేపమని అతను ఏవేవో లెక్కలు వేసి చెప్పాడు. ''అరవై అవుతుంది–''

''అరవై వేలే! నేను దీన్ని కొన్నదే లక్షన్నరకు కొన్నా– లక్షన్నరకు లక్షణంగా వున్న ఇల్లు వస్తే ఒక్క కాంపౌండ్‌కే అరవై వేలు తగలెయ్యాలా? నువ్వు నన్ను ఏదో మోసం చేస్తున్నావు!'' దబాయించాడు గౌండాను.

''మీరు కొని రెండేళ్లయింది కదండీ – అప్పటికీ ఇప్పటికీ రేట్లు బాగా పెరిగిపోయాయి. కావాలంటే యింకెవరినైనా కనుక్కోండి. అరవై మీరిచ్చినా నాకేం లాభం వుండదు. చేతినుంచి పడకుండా వుంటే చాలు'' చెప్పాడు గౌండా కాశిం.

తర్జనభర్జనల పైన ఓ రెండువేలు తగ్గించాడు– పని వీలైనంత తొందరగా ప్రారంభించమని అడ్వాన్సుగా పది వేలు ఇచ్చాడు.



ఓ రెండురోజుల తర్వాత పునాదులు తవ్వే కూలీలు ఓ ఆరుమంది తయారయ్యారు కాశిం పంపేడంటూ.

లేబరు కాంట్రాక్టు మాట్లాడుకున్నారు కాబట్టితనకేం నష్టం లేదు అనుకున్నాడు ఎంతమంది వచ్చినా.

వాళ్లు మార్కింగు చేసుకుంటూ వున్నారు.

ఇంతలో వాళ్లింటి పురోహితుడు ఏదో పనిమీద అటు పోతూ ఇతగాడు బయట నిలబడుండటం చూసి లోపలికి వచ్చాడు.

''అయ్యా! తమరు ఇల్లు రిపేరీలు చేయిస్తున్నారా?''

''రిపేరి కాదండి ... ప్రహరీ గోడకట్టిస్తున్నా?''చెప్పాడు.

''పునాదులు తవ్వుతారా?''అడిగాడు పురోహితుడు శర్మ.

''భలేవాడివే పునాది తవ్వకుండా గోడలు ఎలా లేపుతారు.''

''కొంచెం ఆలోచించండి– ఈ నెలలో పునాదులు తవ్వకూడదు. నేను మళ్లీ ముహూర్తం పెట్టేదాకా తవ్వకుండా ఆపండి–'' చెప్పాడు.

నాకటువంటి నమ్మకాలు లేవయ్యా– పునాదులు తవ్వడానికి –మాసానికి సంబంధం ఏంటి? మీ సలహా నాకువద్దు'' కోపంగా చెప్పాడు సూర్యం.

''ఏదో మంచికోసం చెప్పాను– ఆ తర్వాత ఏం జరిగినా నన్ను అడగవ

ద్దు-'' అంటూ తనలో తాను గొణుక్కుంటూ వెళ్లిపోయాడు శర్మ.


''మీరుకానివ్వండి -'' చెప్పాడు సూర్యం.

ఇంతలో యింట్లోంచి పిలుపు వచ్చింది భార్య నుండి-

''ఏవండోయ్! ఒక్కమారు ఇలా రండి -దేవుడు లాగా వచ్చి ఆ శర్మగారు తవ్వద్దని చెప్పారు. ఆయన ఎందుకు చెప్పారో ఏమో!''

''ఏంటే నీ చాదస్తం - వీళ్లకి పని పాటా వుండదు. ఉచిత సలహాలు ఇస్తూ వుంటారు.'' భార్యమీద కస్సుబుస్సులాడాడు.

చంద్రమ్మ అంతకంటే గట్టిది.... అతన్ని వారించింది.




''ముందు వెనుక ఆలోచించండి - భార్యాబిడ్డ లున్నవాళ్లు శాస్త్రం వద్దన్న తర్వాత చేస్తే ఏమవుతుందో ఏమో?'' భయపడింది చంద్రమ్మ.

''ఏమవుతుందే! ఏమవతుంది? నేను పోతానా- పోనీ ఏదో ఒకరోజు పోవలసిందేగా- కోపంగా అరిచాడు.

''మీకేమీ కాదండి. మీరు నాస్తికులు కాబట్టి - కాని వాస్తుదెబ్బ మన పిల్లలకు తగిలితే-పసిపిల్లలు - మీ పుణ్యమాని ఏమన్నా అయితే- మనం జీవితాంతం బాధపడాలి!'' ఏడ్చేసింది చంద్రమ్మ.

సూర్యం కరిగిపోయాడు. చిట్టి- బాబు అంటే వారికి అమితమైన ప్రేమ- వాళ్ల బ్రతికేదే వాళ్ల కోసం.

''అయితే ఏంటంటావే - పునాదులు తవ్వవద్దంటావా? మరి ఈ గాడిదలు - కుక్కలు నానాబీభత్సం చేస్తున్నాయి ఇంటిమీద పడి కాంపౌండు ఇంటికి రక్షణ! దొంగలు కూడా రాలేరు'' చెప్పాడు సూర్యం.

''రెండేళ్లుగా లేంది ఇప్పుడు మటుకు ఏం కొంప లంటుకుంటాయి?''

''అప్పుడేదో కంచెవుంది... అది పాడైపోయిందనిగా మనం ప్రహరీగోడ కట్టిస్తున్నది - ఉన్న ఆ కాస్త రక్షణకూడా తీసేశాం - మళ్లీపెట్టాలంటే బోల్డుఖర్చు. అయినా అదికాదే! అడ్వాన్సు ఇచ్చాను - వాళ్ల రాళ్ల గచ్చు అంతా తెచ్చుకున్నారు - పనోళ్ల వచ్చారు- మళ్లీ ముహూర్తం అంటే మనకంతా వేస్టు అయిపోతుంది'' సూర్యం తెగబాధపడ్డాడు.

''ఏవండోయ్! ఆయన చెప్పింది పునాదులు తవ్వద్దనేగా - గోడకట్టవద్దని చెప్పలేదుగా- గోడ కట్టించెయ్యండి-'' సంతోషంగా చెప్పింది.

''ఏంటి పునాదులు లేకుండా గోడ కట్టాలా? మతివుందా?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''దాందేముంది-డబ్బులేనోళ్లు ఎంతమంది సరిహద్దుగా రాళ్లు పేర్చుకుని పెట్టుకోరు- మనమూ అదే పనిచేద్దాం. తెచ్చిన వాటిని టెంపరరీగా గోడకట్టమనండి- ఆ తరువాత ఒక శుభముహూర్తాన మళ్లీకట్టిద్దాం- ''చెప్పింది.

సూర్యంకు ఈ సలహా బాగా నచ్చింది.

వెంటనే కూలీలను పిల్చి పునాదులు తవ్వద్దు రాళ్లను గోడలాగా పేర్చమని చెప్పాడు.

''లేదు దొరా! మా పనికాదు- మేము తవ్వేవాళ్లమే! గోడకట్టేగొండా వేరే వున్నాడు. ఇప్పుడు మేము తవ్వాలా వద్దా చెప్పండి'' మేస్త్రీ అడిగాడు.

''అక్కర్లేదు - ఇంటికిపోండి'' చెప్పాడు.

''మా కూలీలు ఇప్పించండి వెళతాం!''

''నువ్వేపనీ చేయలేదుగా!?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''పొద్దుటినుంచి మీ కోసమే కదా ఇక్కడ కూర్చుంది. ఇప్పుడు యింటికిపోతే మాకు పని ఎవరిస్తారు -అందుకని మా అందరికీ కూలి ఇప్పించండి- పోతాం''చెప్పాడు ఓ కూలీ.

సూర్యం ఘర్షణ పడ్డాడు.

ఈలోగా గొండావచ్చాడు. అతన్ని న్యాయం చెయ్యమన్నాడు.

లాభంలేదు సార్?కావాలంటే తవ్వమంటే తవ్వుతారు- కాని ఇంకో పని చెయ్యరు.'' తేల్చి చెప్పాడు.

మళ్లీ వాళ్ళు గడ్డపారలు తీసుకున్నారు తవ్వడానికి.

చంద్రమ్మ లబోదిబోమంటూ పరుగెత్తుకుంటూ వచ్చింది వద్దంటూ.

సూర్యం ఇంక తప్పదన్నట్లు డబ్బులిచ్చేసి పంపించేశాడు - గొండాకు చెప్పాడు గోడలా పేర్చమని రాళ్లను.

తిక్కోడిని చూసినట్లు చూశాడు - సరే కూలి గిట్టుబాటవుతుందని ఒప్పుకున్నాడు..

తెచ్చిన గచ్చు మధ్యమధ్యలో వేస్తూ వున్న రాళ్లను చెక్కి గోడలా ఓ దానిపైన ఒకటి నిలబెట్టారు. ఓ వారంలో ఆ పని పూర్తిచేసి వాళ్లకూలి మామూలుగానే తీసుకొని వెళ్లిపోయారు. నేల మీంచి కాబట్టి తొమ్మిది అడుగులు ఎత్తుతో కాంపౌండు వాలు కోటగోడలా తయారైంది. బయట ప్రపంచం లోపలికి కనపడదు. లోపలి వాళ్లు బయటకు కనపడరు.

గ్రిల్లు గేటు కూడా పెట్టించాడు.

ఇంటికి అందం వచ్చిందని సంతోషపడ్డాడు. తన తెలివికి తానే మురిసిపోయాడు. అటు శర్మగారిని ఇటు వాస్తు పండితులను తృప్తిపరిచినట్లు భావించాడు.

ఓరోజు రాత్రి పెద్ద గాలివాన వచ్చింది. మంచి నిద్రలో వుండగా.

డబడబ శబ్దాలు అయితే మెలకువ వచ్చి లేచి కూర్చున్నాడు సూర్యం.

లైటువేసి బయటకొచ్చి చూశాడు.

ఎక్కడా కాంపౌండు వాలు కనపడలేదు.

ఇంకా పరిశీలనగా చూస్తే యింటిపైన పడిపోయింది ఒకవైపు- ఇంకోవైపు ఇంకోళ్ల యింట్లోపడిపోయింది.

''అంతా నష్టం'' అని తిట్టుకుంటూ లైట్లు ఆర్పేసి పడుకున్నాడు.

తెల్లవారుఝామున ఎవరో తలుపులు కొడుతూ వున్నారు.

విసుక్కుంటూ లేచారు సూర్యం- చంద్రమ్మలు.

''ఇంతపొద్దున్నే ఏంటి విషయం?''

''ఇంత పొద్దున్నే ఏంటి- ఆరు అయింది - మందుకొట్టి పడుకున్నావా?'' పక్కింటి మద్దయ్య గయ్యిమని అరుస్తున్నాడు.

చంద్రయ్యది వీళ్ల పక్కిల్లే. - అతనికి పశువుల పాక వుంది. పాలవ్యాపారం చేస్తూ వుంటాడు. వీళ్లతో పోలిస్తే బీదవాడు. ఇతను అతనికి పక్కన ఇల్లు కొన్నప్పటినుంచి ఏదో విషయంలో గొడవపడుతూనే వుండేవాడు. అలాగే చంద్రమ్మకూడా పేడవాసన వస్తున్నదని- ఈగలు వస్తున్నాయని రకరకాల ఫిర్యాదులు చేస్తూవుండేది. ఇద్దరికీ సరిహద్దుగా వున్న కంచెతీసేసి గోడకట్టించాడు. గోడలో సగం ఖర్చు భరించమంటే అతను ఒప్పుకోలేదు. ఎక్కడికి పోతాడులే పంచాయితి పెట్టించి వసూలు చేసుకుందామనుకున్నాడు.

ఇంతకీ ఎందుకు పొద్దున్నే నిద్రలేపావు?'' కోపంగా అడిగాడు.

''మా దూడలు రెండు చచ్చిపోయాయి - నీ మూలంగా - నష్టపరిహారం చెల్లించు'' మద్దయ్య

అడుగుతున్నాడు.

"ఏంటీ లేవగానే కల్లుతాగావా- పిచ్చిపిచ్చిగా వాగుతున్నావు?

"రాత్రిగాలి వాన వచ్చింది తెల్సా?"

"దానికి నా బాధ్యత ఏముంది ఎగతాళిగా అడిగాడు సూర్యం.

"గాలివానకు కారణం నువ్వుకాదు కాని నా దూడలు చచ్చిపోవడానికి కారణం ఖచ్చితంగా నువ్వే! గోడ సరిగా కట్టించకుండా - కక్కుర్తిపడి పునాదులు తియ్యకుండా - రాళ్లు పైపైన పేర్పించావుగా... రాత్రిగాలివానకు ఆ గోడకూలి ఆ రాళ్లు అన్నీ నా పశువులపాకపైన పడ్డాయి - ఆ రాళ్ల దెబ్బకు నా దూడలు చచ్చిపోయాయి. ఇప్పుడు నాకేటి దిక్కు?!" మద్దయ్య అడిగాడు.

"నాగోడ కూలిపోయిందని నేను ఏడుస్తుంటే - మధ్యలో దూడలు చచ్చి పోయాయని బాధపడ్డావు. అస్సలు నీ వైపు గోడకు నాకు సగం డబ్బులిచ్చావా? పదివేలు ఖర్చయింది- అయిదువేలు యివ్వు."దబాయించాడు. ఇలా వాదులాట మొదలయింది.

ఇంతలో మద్దయ్య భార్య వనజాక్షి ఆ గొడవలోకి ఆరంగేట్రం చేసింది. ... 'మీరు నాశనమైపోతారు. బీదోళ్ళ నోరుకొడితే దేవుడు ఊరుకోడు. అందులో మాదికష్టపడి సంపాదించిన డబ్బు- నీలాగా లంచాలు మేసింది కాదు" వనజాక్షికి ఆవేశం వస్తే ముందు వెనుక చూడదు. ఏదేదో వాగుతున్నది.

దాంతో చంద్రమ్మ కూడా లోపలినుండి వచ్చి తనవంతు సాయంగా సూర్యంకు పెట్టనిగోడలా నిలబడి వాళ్లమీద విరుచుకుపడింది. కూలిన గోడ గురించి పొద్దున్నే ఇంతపెద్దగలాటా అయ్యేసరికి వీధిలో వాళ్లంతా గుమిగూడారు- ఇద్దిరికీ సర్దిచెప్పబోయారు.

కాని ఇరుపక్షాలు రెచ్చిపోతున్నాయి.

ఇంతలో ఒంటిలింగం శొంఠికొమ్ములాగా శర్మ ప్రవేశించాడు. ఎటోపోతూ అక్కడ ఆగాడు.

"నేనొక మాటచెబుతా వింటారా! మీరిలా ఎంతసేపు అరుచుకున్నా ఉపయోగం లేదు. ఆదివారం పెద్దమనుషుల పంచాయితీపెట్టిద్దాం. వాళ్లు ఎలా నిర్ణయిస్తే అలా చేద్దాం-" అంటూ ఇద్దరికీ సర్దిచెప్పాడు.

దాంతో ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. శర్మ కూడా పోబోతే చంద్రమ్మ అతన్ని లోపలికి పిలిచి ఆ యిల్లు కొన్నప్పటినుంచి తాము అనుభవించిన నరకం వివరించింది. చివరగా ఇలా అంది...

"నేను ముందే చెప్పాను. కొత్తయిల్లు కట్టుకుందాం అని- పాత యిల్లు మనకు వద్దంటే విన్నాడా! అగ్గువగా వస్తున్నదని కొని మమ్మల్ని ఈ మారుమూల అడవిప్రాంతంలో తెచ్చిపడేశాడు. ఊళ్లోకి పోవాలంటే చాలాదూరం నడవాలి ఆటోలకోసం.. మంచినీళ్లు రాకపోతే చాలాదూరం నడచి తెచ్చుకోవాలి రోడ్లు ఇక్ష్వాకుల కాలం నాటివి. చేరినప్పటినుంచి మనశ్శాంతి లేదు" తన బాధలు కొన్ని వివరించింది.

"అమ్మా! నే ముందే చెప్పానమ్మా. ఈ ఇంటికి వాస్తు బాగోలేదు- కొనద్దని దక్షిణ ముఖం ఇల్లు మీ జాతకానికి అచ్చిరాదు. అని. ఆయన నాకటువంటి నమ్మకాలు లేవు - నేను నాస్తికుడ్ని అన్నాడు- శర్మ పుల్లలు పెట్టాడు.

"కాలుతుందని నాకు తెలియదు- పొరపాట్న నిప్పులో చెయ్యి పెట్టానంటే ఊరుకొంటుందా నిప్పు. కాలి తీరుతుంది. ఆయనకు నమ్మకాలున్నా లేకపోయినా వాస్తు తన పని తాను చేసుకుపోతుంది. శర్మగారు - పోనీ ఏం మార్పులు చేయాలో చెప్పండి - చేస్తాం!" చంద్రమ్మ చెప్పింది.

శర్మ ఇల్లు ఇంకోసారి పరిశీలించాడు.

"ఆగ్నేయం పెరిగింది- మీ బెడ్డురూము ఆగ్నేయంలో వుంది. మీ భార్యాబిడ్డలకు మన శాంతి వుండదు. చీటికి మాటికి గొడవలొస్తాయి" చెప్పాడు శర్మ.

"ఆ! వాస్తు బాగున్న వాళ్లిళ్లల్లో భార్యాభర్తలు కీచులాడుకోకుండా వున్నారా"సూర్యం అడిగాడు అసహనంగా.

"మీరూరుకోండి- ఆయన్ని చెప్పనివ్వండి", చంద్రమ్మ ప్రోత్సహించింది.

"వంటిల్లు మార్చాలి ఆగ్నేయానికి. ఈశాన్యంలో బరువులు వేశారు- ఈశాన్యంలో పూచిక పుల్లవేసినా, దాని బరువు వల్ల మీకు ఖర్చులు పెరుగుతాయి. ఇంటి నడక మార్చాలి. మీ ఇంటికి గేటు నీచంలో పడింది" అంటూ ఓ కాగితం మీద మార్పులు రాశాడు.

## అదిరేస్ నేహా డ్రస్

**అం**దాలను ప్రదర్శించడంలో ఎవరికీ తీసిపోని నేహా ధూపియాకి నగలపిచ్చి జాస్తి. జూలీ సినిమాలో ప్రేక్షకులను పిచ్చెక్కించిన నేహా తెలుగులో రాజశేఖర్ సరసన కూడా నటించింది. ఆ సినిమా ఫట్‌మనడంతో నేహాకి గుర్తింపు రాలేదు. పెద్దగా అవకాశాలు రాకపోయినా నేహా మాత్రం తనను తానో పెద్దస్టార్‌గా భావించుకుంటోంది. డ్రస్‌లు, జ్యూవలరీపై లక్షలు ఖర్చుపెట్టే నేహాకు ఫంక్షన్లకు వెళ్లడమంటే ఇష్టం. నేహా డ్రస్‌లు చూసి ఫంక్షన్లకు వచ్చిన అతిథులకు కళ్ళు చెదురుతున్నాయట!



''శర్మగారు పొద్దున్నే మా ఖర్మకొద్దీ దాపురించారు. ఇండియాకే వాస్తులేదట- ఇంక మా ఇంటికి ఏమొచ్చింది లెండి! ఈ మూఢవిశ్వాసాలంటే నాకు నమ్మకం లేదు.'' తెగేసి చెప్పి ఆయన్ని పంపించివేశాడు.

అప్పటినుంచి చంద్రమ్మ మనసులో అనుమాన బీజం మొదలయింది. పిల్లలకు మార్కులు తగ్గినా వాళ్లు వాస్తు బాగోలేదు- మాకు చదువుబాగా రావడంలేదు అంటున్నారు.

పనిమనిషి ఎగ్గొట్టినా - ఇంట్లో అదనపు ఖర్చు వచ్చినా- ఇరుగుపొరుగుతో తగులాటలు వచ్చినా చంద్రమ్మకు పిల్లలకు వాస్తు బాగోలేదని అనుకోవడం మామూలై పోయింది.

ఓ రోజు ఓ గౌండాను పిలిచి అడిగింది శర్మ సూచించిన మార్పులు చేర్పులకు ఎంత ఖర్చవుతుందని.

అతను చెప్పిన లెక్కవిని కళ్లు తిరిగాయి.

లక్షన్నర పైన అంచనా వేశాడు.

''ఓయ్! గౌండా నువ్వు మమ్మల్ని ఏమనుకుంటున్నావు కోటీశ్వరుల మనుకుంటున్నావా? లక్షలు లక్షలు ఖర్చు పెట్టడానికి. ముందు ఆ కాంపౌండ్ వాలు పునాదులు తవ్వి మళ్లీ కట్టించాలి. అదిగాకుండా నువ్వు ఇంటిలో చిన్న చిన్న మార్పులకు కూడా యింత చెబితే మేం ఇల్లు అమ్ముకొని పారిపోవాలి!'' చంద్రమ్మ కేకలేసింది గౌండా పైన.

''మీరుకావాలంటే చేయించుకోండి - లేకపోతే లేదు - ఏదో నాకు పెట్టిపోషించినట్లు మాట్లాడుతున్నారు రిపేరు చేయించుకుంటారో, ఆ వాస్తుతో యమబాధలు పడుతారో నాకనవసరం -'' గౌండా సమాధానం చెప్పి వెళ్లిపోయాడు.

''ప్రతి మనిషికి దశ- దిశ అని రెండుంటాయి. దశ బాగున్నప్పుడు దిశ అంటే వాస్తు బాగోకపోయినా పెద్దగా తెలియదు- కాని దిశ కూడా బాగోలేనప్పుడు కష్టాలు రెట్టింపవుతాయి. దశ బాగోలేప్పుడు దిశ బాగుంటే జబ్బుకు మందులేసుకున్నట్లు కొంత ఉపశమనం కలుగుతుంది''

సూర్యం చంద్రమ్మల మధ్య వాస్తు విషయంలో గాలివాన వీచింది.

''నీదంతా మూఢనమ్మకం- మన పూర్వీకులకు ఏ వాస్తువుండేదని వాళ్లంతా బాగా బతికారు చీకూ చింతాలూకుండా'' సూర్యం చెప్పాడు.

'' ఆ కాలంవేరు- ఆ బతుకులు వేరు అప్పుడు శాస్త్రజ్ఞానం వుండేది కాదు - ఆ కాలంలో మందులున్నాయా కొన్నిరోగాలకు - కాని నేడు వున్నాయిగా-'' చంద్రమ్మ

''అరే! వాస్తు- శాస్త్రంకాదు-'' గట్టిగా చెప్పాడు.

''మరికాకపోతే - ప్రతివాడు దీన్ని ఎందుకు నమ్ముతున్నాడు- ఆఖరికి అద్దెకివ్వాలన్నా ఈ కాలం వాస్తు లేనిది దిగడంలేదు'' చంద్రమ్మ చెప్పింది.

'' ఇది మాసు హిస్టీరియా! ఒకడ్ని చూసి ఒకడు చెడిపోతున్నాడు - వాస్తు బాగున్న ఇళ్లలో రోగాలు రావడం లేదా - నష్టాలు రావడం లేదా- చావులు లేవా? మరి దానికేం చెబుతారు?'' ఓసారి శర్మను అడిగాడు.

''అయ్యా! వాస్తుబాగున్న వాళ్ల జాతకం బాగోలేకపోతే కష్టాలు అనుభవించక తప్పదు - జాతకఫలం ఎటువంటి వారికైనా తప్పదు.''

''మరి ఇంక వాస్తుతో పనేంటి- జాతకంలో ఎలా రాసి వుంటే అలా జరుగుతుందని కదా మీ నమ్మకం!'' సూర్యం అడ్డంగా వాదించాడు.

''ప్రతి మనిషికి దశ- దిశ అని రెండుంటాయి. దశ బాగున్నప్పుడు దిశ అంటే వాస్తు బాగోకపోయినా పెద్దగా తెలియదు- కాని దిశ కూడా బాగోలేనప్పుడు కష్టాలు రెట్టింపవుతాయి. దశ బాగోలేప్పుడు దిశ బాగుంటే జబ్బుకు మందులేసుకున్నట్లు కొంత ఉపశమనం కలుగుతుంది'' నచ్చజెప్పాడు శర్మ.

చంద్రమ్మ కోరిక మేరకు గౌండాను పిలిపించి దగ్గరుండి వాస్తు సరిచేయించాడు కొంతవరకు. లక్షరూపాయలు అనుకుంటే అది కాస్తా రెండు లక్షలు దాటిపోయింది. తప్పదు - కుటుంబం కోసం కొన్ని నమ్మినా నమ్మకపోయినా చెయ్యాలిగా.

''దీనిబదులు కొత్త ఇల్లు వచ్చేది- లేదా నువ్వన్నట్లు ఖాళీ జాగా కొనుక్కుని మంచి ఇల్లు కట్టుకునేవాళ్లం'' అని వాపోయాడు సూర్యం.

పెద్ద మనుషుల పంచాయితీ కూడా తెగింది.

దానిలో భాగంగా సూర్యం మధ్దయ్యకు నష్టపరిహారం ఇవ్వక్కరలేదు కాని మధ్దయ్య కూడా సూర్యంకు గోడకు - డబ్బులివ్వక్కరలేదు.

ఆ తీర్పు సూర్యంకు నచ్చకపోయినా - పెద్దమనుషులు కాబట్టి - వారితో అవసరం పడుతూ వుంటుంది కాబట్టి తలొంచుకోక తప్పలేదు.

కాలం గడుస్తూంది.

పిల్లలు కొంచెం కొంచెం పెద్దవాళ్లవుతున్నారు-

ఎప్పుడూ రోగాలు - రొష్టులు

చదువులో పెద్దగా రాణించింది లేదు.

ఈరోజు చంద్రమ్మకు ఆరోగ్యం అస్సలు బాగోలేదు.

ఆ మాటకొస్తే ఆమె నిత్యరోగి అయ్యింది - ఒంట్లో బాగుండటం లేదు.

సూర్యం పరిస్థితి చూస్తే ఆర్థికంగా ఇంకొంచెం దిగజారాడు- వడ్డీల భారం ఎక్కువై పోతున్నది. ఇల్లు ఊరికి దూరంగా వుండటం వలన రవాణా ఛార్జీలే తడిసి మోపెడవుతున్నాయి వారికి.

శర్మ పలకరించి పోదామని వచ్చాడు.

''ఏమ్మా బాగున్నరా?వాస్తు సరి చేయించారు బావుండక ఏం చేస్తారు లేండి?''

''నా బొంద వాస్తు- మా పరిస్థితి పిసరంత కూడా బాగోలేదు- అప్పుడే బాగున్నాం. వాస్తు సరిచేయించింతర్వాత ఇల్లు ఇరుకైంది - అసౌకర్యంగా మారి పోయింది మా ఆరోగ్యం కాని- ఆర్థిక పరిస్థితి కాని ఏమీ బాగోలేదు'' చంద్రమ్మ మంచం మీంచి లేచి చెప్పింది శర్మకు.

''ఏం శర్మగారు - వాస్తు వాస్తు అంటూ లక్షలు తగలేశాం- ఆ డబ్బులు బ్యాంకులో వున్నా మమ్మల్ని ఆదుకునేవి- ఊరికే అప్పుల పాలై వడ్డీలు కట్టలేక చచ్చి పోతున్నాం-''సూర్యం కూడా విరుచుకుపడ్డాడు.

శర్మ కాస్త ఖంగు తిన్నాడు - బుర్రగోక్కున్నాడు - వెంటనే చెప్పాడు ''నేను ముందు చెప్పాను మీకు ఈ యిల్లు అచ్చిరాదని. దక్షిణ ముఖం పనికిరాదు- అన్నీ యమ బాధలు - యమఖర్చులు వుంటాయి. ఇప్పటికైనా అమ్మేసి కొత్తది కొనుక్కోండి'' ఉచిత సలహా ఇచ్చాడు.

''అంటే దక్షిణ ముఖం యింట్లో వున్న వాళ్లంతా మాలాగే వున్నారా?'' అయితే ఊళ్లల్లో దక్షిణపు వీధులే వుండవా?'' అంటూ క్లాసు తీసుకున్నాడు సూర్యం.

అస్సలు చెన్నై వైపు దక్షిణం ఇళ్లకే ఎక్కువ ప్రాముఖ్యత యిస్తారు.'' చంద్రమ్మ చెప్పింది.

''ఇప్పుడు వాస్తు ఎలాగంటే - మన పక్కింటికి - ఎదురింటికి - వెనకటింటికి వాస్తు బాగోలేకపోయినా ఆ దోషాలు కొన్ని మనకు కూడా కొడుతుంటాయి. అలాగే మన వూరి వాస్తు బాగోలేకపోయినా ఆ దోషం కూడా మనల్ని వేధిస్తూ వుంటుంది. నన్నడిగితే వాస్తు దోష పరిహారార్థం పూజలు చేద్దాం - మీరు ఊ అంటే ఓ మంచి రోజు చూసి పూజచేసి యంత్రాలు బిగిస్తాను- అప్పుడు ఏ దోషాలు వుండవు మనింటికి'' శర్మ పూజా విధానం - అన్ని చెప్పి - పాతికవేలు ఖర్చుకావచ్చని చెప్పాడు.

చంద్రమ్మకు చిర్రెత్తుకొచ్చింది. ''మా ఆయనలాగా నాస్తికురాలిగా వుండిపోతే బాగుండేది- మిమ్మల్ని, వాస్తును నమ్మి లక్షలు తగలేశాం చూడండి- అది నాదే తప్పు'' చంద్రమ్మ బాధగా చెప్పింది.

''లేదు లేదు - అద్దె ఇంట్లో హాయిగా వుండకుండా సొంత ఇల్లు కావాలనుకున్నానే అది నే చేసిన తప్పు. అచ్చిరాకపోతే అద్దె ఇల్లు సంవత్సరానికోటి మార్చచ్చు. కాని స్వంత యింటిపైన మమకారం అమ్మలేం - వదిలి పోలేం - నాదే తప్పు.'' చెప్పాడు సూర్యం ఇల్లుని ఎగాదిగా చూస్తూ.

''హూ! నాదే తప్పు. పొద్దున్నే నా పని చూసుకోకుండా మీ ఇంటికొచ్చానే. నన్ను నేను చెప్పు తీసుకొని కొట్టుకోవాలి. ఈ శర్మ ఖర్మ కాకపోతే మీలాంటి వారికి ఉచితంగా వాస్తు సలహాలు ఇచ్చి తిట్లు తిండం దేనికట'' అంటూ ఉత్తరీయం భుజాన వేసుకుని వెళ్లిపోబోయాడు శర్మ.

''అందరికీ వడదెబ్బ, వానదెబ్బ తగులుతూ వుంటే మాకు మాత్రం వాస్తుదెబ్బ తగిలింది'' ఏడ్వలేక నవ్వింది చంద్రమ్మ.

శర్మ వెనక్కు తిరిగి చూసి ఉత్తరీయం దులిపి వెళ్లిపోయాడు.

★